ప్రజాశక్తి
బుధవారం 21 మే 2025
5
శ్రీ సత్యసాయి

గణేష్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన అంగన్వాడీలు

ఆగనున్న ఆర్డీటీ వైద్యసేవలు..?

- ప్రశ్నార్థకంగా పేద ప్రజల ఆరోగ్యం
- ఇప్పటికే విద్యా సేవలను నిలిపేసిన సంస్థ
- ఆందోళనలో వేలాది మంది ఉద్యోగులు
- దిన దిన గండంగా సేవల నిర్వహణ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్‌ట్రస్టు) నిర్వహణ అంశంపై ప్రధానంగా చర్చ జరుగుతోంది. ఉమ్మడి అనంతరం జిల్లాతో పాటు అటు తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోనూ ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎ(ఫారిన్ కాంట్రిబ్యూటరీ రెగ్యులేషన్ యాక్ట్) పునరుద్ధరణ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. బడుగు, బలహీన, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యంగా కరువు ప్రాంతాల్లో ఆర్డీటీ ఐదు దశాబ్దాలకు పైగా అండగా ఉంటోంది. అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిని ఆదుకుంటూ ప్రజల మన్ననలు పొందింది. ఆ సంస్థ నిర్వహిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అత్యున్నత అవార్డులు, సత్కారాలను అందించాయి. ఇలా ఎంతో ఉన్నత స్థాయి సేవలను అందిస్తున్న ఆర్‌డిటికి ప్రస్తుతం కష్టమొచ్చింది. సంస్థ ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయకపోవడంతో ఒక్కసారిగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సంక్షోభం నెలకొంది. ఇప్పటికే విద్యాసేవలను నిలిపివేసిన సంస్థ వైద్యసేవలను కూడా నిలివేయనున్నట్లు సమాచారం. ఇదే జరిగితే ఉమ్మడి జిల్లాలోని పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడటం ఖాయం.

ప్రజాశక్తి - అనంతపురం సిటీ

ఆర్‌డిటి ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమం, వ్యవసాయం, స్వయం ఉత్పత్తి సాధికారత లక్ష్యంగా ప్రభుత్వ అంచనాలకు మించి క్షేత్రస్థాయిలో అట్టడుగు స్థాయి ప్రజలను అభివృద్ధి వైపు నడిపించిందని చెప్పవచ్చు. అలాంటి సంస్థ మొట్టమొదటిసారిగా ఎఫ్ సి ఆర్ ఏ కారణంగా ఈ ఏడాది ఆర్‌డిటి సెట్‌ను నిలిపివేసింది. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి పేద విద్యార్థులను విద్యావంతులుగా, ఉద్యోగాలుగా తీర్చిదిద్దే లక్ష్యం నీరుగారిపోయింది. ఇక అత్యవసరమైన వైద్యరంగం పైన ఎఫ్‌సిఆర్‌ఎ ప్రభావం పడుతుందనే భావన ఇప్పుడు అందరిని ఆందోళనకు గురి చేస్తోంది. మెరుగైన వైద్యం అంటేనే ముందుగా జిల్లాలలో ఆర్డీటీ పేరు వినపడుతుంది. ఎఫ్‌సిఆర్‌ఎ కారణంగా వైద్యరంగంలో విపత్కరమైన పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరో నెలపాటు ఇదే క్రమంలో కాలం గడిస్తే ఆర్డీటీ నిర్వహిస్తున్న ఆసుపత్రులను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని సమాచారం. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆర్డీటీ ఆసుపత్రుల్లో ఏటా 8.5 లక్షల అవుట్ పేషెంట్‌లు, 46వేల మంది ఇన్ పేషెంట్ అడ్మిషన్లు, 14వేల డెలివరీలు, 15వేల సర్జరీలు జరుగుతున్నాయి.

ఉమ్మది అనంతపురం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, నిరుపేద రోగులకు నాణ్యమైన సంరక్షణ సేవలను అందించడానికి ఆర్డీటీ బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్‌లో మొత్తం 532 పడకలతో మూడు గ్రామీణ ఆసుపత్రులను స్థాపించింది. ఆరోగ్య సేవలకు అధిక ఖర్చులు భరించేలేని అనేకమంది గ్రామీణ రోగులకు అతి తక్కువ ఖర్చుతో ఆర్డీటీ వైద్యసేవలను అందిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఈ ప్రధాన ఆసుపత్రులను మూసివేస్తే పేదల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.

బత్తలపల్లిలోకి ఆర్డీటీ ఆసుపత్రి

ప్రస్తుతం కళ్యాణదుర్గం, బత్తలపల్లి ఆసుపత్రిలో 36 మంది నవజాత శిశువులు నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్‌ఐసియు)లో చికిత్స పొందుతున్నారు. వారిలో 9 మంది చాలా అనారోగ్యంతో ఉన్న పిల్లలు ఉన్నారు. ఆసుపత్రుల అనిశ్చిత పరిస్థితి కారణంగా ఈ క్లిష్టమైన నవజాత శిశువులందరి ప్రాణాలకు ప్రమాదం ఉందని అక్కడి వైద్యులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం ఆర్డీటీ ఆసుపత్రులలో పేద, అవసరమైన రోగులకు 15వేల శస్త్రచికిత్సలు చేస్తున్నారు. వాటిలో 5వేలకు పైగా సంక్లిష్ట శస్త్రచికిత్సలు చేస్తున్నారు. అంతేకాకుండా అత్యంత సాధారణ శస్త్రచికిత్సలు సిజేరియన్ విభాగం (అత్యవసర, ఎలెక్టివ్), అన్ని అత్యవసర ట్రామా కేసులు, ఓపెన్ అబ్డామినల్ సర్జరీలు, గైనకాలజికల్, అబ్డామినల్ లాపరోస్కోపిక్ సర్జరీలు కూడా ఉన్నాయి. అదేవిధంగా 171 మంది తలసేమియా పిల్లలు ఆర్డీటీ ఆసుపత్రుల్లో ఉన్నారు. వారిలో 127 మంది రక్త మార్పిడిపై ఆధారపడి ఉన్నారు. బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం 26 మంది పిల్లలను స్పాన్సర్ చేసింది. ఈ పిల్లలందరూ ఆర్డీటీ ఆసుపత్రులపై ఆధారపడి ఉన్నారు.వీరితో పాటు డయాబెటీస్, మూర్ఛవ్యాధి తదితర రోగాలతో బాధపడుతున్న వారు ఆర్డీటీ సేవలపైనే ఆధారపడి ఉన్నారు. ఎఫ్‌సిఆర్‌ఎ కారణంగా ఆర్డీటీ గ్రామీణ ఆసుపత్రులు అందించే ఈ ప్రామాణిక, ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ సేవలన్నీ మూసివేయబడే ప్రమాదం ఉంది.దీని ఫలితంగా లక్షలాది గ్రామీణ ప్రజలకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలు నిలిచిపోతాయి. అంతేకాకుండా ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలకు ఉపాధి కోల్పోవాల్సి వస్తుంది.

ఈనేపథ్యంలో అత్యున్నతమైన సేవలను అందిస్తున్న రూరల్‌డవలప్‌మెంట్ ట్రస్టును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ముఖ్యంగా అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం జరుగుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని పేద ప్రజలు సామాన్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాల్సి ఉందని ప్రజలు మేధావులు రాజకీయ నాయకులు కోరుతున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వీడి కార్మికుల సంక్షేమం కోసం పాటుపడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం స్థానిక గణేష్ సర్కిల్‌లో అంగన్వాడీ వర్కర్లు, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ కార్మికులు మానవహారంగా ఏర్పడి కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ అన్ని రంగాలోల కార్మికులకు కనీస వేతనం చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించడం, పని గంటలు పెంచే యోచన చేయడం తగదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9వ తేదీ దేశవ్యాప్తంగా వివిధ కార్మిక సంఘాలు చేపడుతున్న నిరసనలో అన్ని ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బ్యాల్ల అంజి, ముత్యాలు, నాగార్జున, చంద్రశేఖర్, సిద్దు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు మణెమ్మ, సుజాత, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

మారని రెవెన్యూ అధికారుల తీరు

అధికారుల నిర్వాకంతో రైతులకు తప్పని తిప్పలు
న్యాయం చేయాలంటూ వేడుకుంటున్న బాధిత రైతులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

వైసీపీ ప్రభుత్వ హయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని తమకు చెందిన భూమిని గ్రామ వార్డు సచివాలయ సర్వేయర్ అత్యుత్సాహం ప్రదర్శించి రికార్డులు మార్చి ఇతరులకు కట్టబెట్టారని తమకు జరిగిన అన్యాయంపై రెండు సంవత్సరాలుగా నల్లచెరువు రెవెన్యూ కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తూన్న న్యాయం జరగలేదని బాధిత రైతులు వాపోతున్నారు. మండల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రేపు మాపు అని కాలం వెళ్లదీస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నల్లచెరువు మండలం మద్దిమడుగు గ్రామానికి చెందిన బాధిత రైతు తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు. తనకు చెందిన 1.21 ఎకరాల భూమిలో 99 సెంట్లను విక్రయించగా వారు పక్కనే ఉన్న మిగిలిన 22 సెంట్ల స్థలాన్ని కూడా. ఆక్రమించేశారని వాపోయాడు. తమకి చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన రైతు ఆక్రమించేందుకు అప్పట్లో గ్రామ వార్డు సచివాలయ సర్వేయర్ బాబా ఫక్రోద్దీన్ సహారించారని తమకు జరిగిన అన్యాయంపై రెండు సంవత్సరాలుగా తహశీల్దార్, సర్వేయర్‌కు విన్నవిస్తున్నా ఫలితం శూన్యమని బాధిత రైతులు ఈశ్వరరెడ్డి, బయారెడ్డి లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకి చెందిన భూమిలో గ్రామ వార్డు సర్వేయర్ అత్యుత్సాహం ప్రదర్శించి ఇతరులకు చెందుతుందని హద్దులు నాటారని తమ భూ సమస్యపై రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్ చుట్టూ తిరుగుతున్నామని చెప్పారు, ఈ విషయంలో గ్రామ వార్డు సచివాలయం సర్వేయర్ అధికారులను తప్పుదారి పట్టిస్తూ తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. తన పేరు మీద ఉన్న భూమిలో హద్దులు చెరిపేసి రికార్డులు తారుమారు చేశారన్నారు. ఇప్పటకైనా జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామ వార్డు సర్వేయర్ పై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. బాధిత రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఆర్డీవో వివిఎస్ శర్మ వద్ద ప్రస్తావించగా ఈ అంశం తన దృష్టికి రాలేదనివిచారణ జరిపించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. అదేవిధంగా భూ సమస్య పరిష్కరించడంలో రెండు సంవత్సరాలుగా జరిగిన జాప్యం పై కూడా విచారణ చేపడతామని తెలిపారు.

వ్యవసాయ శాఖలో బదిలీల 'సాగు'

సిఫారసు లేఖల కోసం ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఉద్యోగులు
బదిలీల ప్రక్రియకు ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ సన్నద్ధం

ప్రజాశక్తి -అనంతపురం

వ్యవసాయ శాఖలో బదిలీల సాగు మొదలైంది. ఉద్యోగుల బదిలీలకు ఆన్‌లైన్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో బదిలీల ప్రక్రియకు ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖలోని ఉద్యోగులు తమకు అనుకూలమైన చోటికి బదిలీ అవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. కొందరు ఉద్యోగులు సిఫార్సు లేఖల కోసం ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

గత ఏడాది సీజన్ మధ్యలో బదిలీలు చేపట్టడం తో వ్యవసాయ శాఖలో బదిలీలు జరగలేదు. దీంతో అప్పట్లో బదిలీ కోరుకున్న వ్యవసాయ సిబ్బంది తీవ్ర నిరాశ కు లోనయ్యారు. ప్రస్తుతం ఇతర శాఖలతో పాటు వ్యవసాయ శాఖలో బదిలీలకు అవకాశం ఇవ్వడంతో ఆ శాఖ అధికారులు, సిబ్బందికి బదిలీ ఫీవర్ పట్టుకుంది. ఐదేళ్లు పూర్తయిన సిబ్బంది తమకు కావాల్సిన చోటకు బదిలీలు చేయించుకునేందుకు ప్రజాప్రతినిధులు ప్రాపకంతో సిఫార్సు లేఖలకోసం వారి ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ శాఖ లో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారు 150 మంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 62మందికి కమిషనరేట్ లో డివిజన్ ఎడిఎలకు, మరియు మండల ఏవోలకు బదిలీ ఉత్తర్వులు ఇస్తారు. వీరి లో ఉమ్మడి జిల్లాలో క్యాడర్ వారిగా చూస్తే డివిజన్ స్థాయి ఏడీఏలు ఐదుగురు ఉన్నారు. అందులో కదిరి, పెనుకొండ, మడకశిర, ధర్మవరం, తాడిపత్రి డివిజన్ ఎడిఎలు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఇక మండల వ్యవసాయ అధికారులు 125 మంది ఉంటే వీరిలో 36మంది మండల వ్యవసాయ అధికారులు ఒకే మండలంలో ఐదేళ్లసర్వీస్ పూర్తి అయిన వారు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అనంతపురం మండలం వ్యవసాయం అధికారి వచ్చి ఐదేళ్లు పూర్తి కానప్పటికీ ఇక్కడ కూడ రాజకీయ నాయకులు ప్రాపకం తో ఖాళీ చేయించి రావాలని కొందరు ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. అదే విదంగా అత్యధికంగా బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, మండలాలకు బదిలీ చేయించుకునేందుకు కొందరు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నటుల తెలుస్తోంది. ఇక వ్యవసాయ విస్తరణ అధికారులు పోస్టులు ఉమ్మడి జిల్లాలో 139 ఉంటే 12 ఖాళీ ఉన్నాయి. మిగిలిన వాటిలో 55 మంది గ్రేడ్- 1, గ్రేడ్-2ఏ వ్యవసాయ విస్తరణ అధికారులు ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వారు ఉన్నట్లు తెలుస్తోంది. వీరి బదిలీల్లో మరింత పోటీ నెలకొన్నట్లు సమాచారం. వీరికి తోడు ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్నవారు కూడా ఉన్న అధికారులు, సిబ్బందికి కూడ బదిలీలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో వ్యవసాయ శాఖ లో బదిలీలు ఫీవర్ నెలకొంది. వ్యవసాయ శాఖలో ఈనెల 28వతేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈనెల 25వతేదీ సాయంత్రం 5 గంట ల్లోపు సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్లైన్లో బదిలీల కోసం ఆప్షన్లు ఇవ్వాలని గడువు విధించారు. అయితే 20వ తేదీ సాయంత్రం వరకు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకొనే అవకాశం లేకుండా పోయింది. వెబ్‌లింక్ ఓపన్ కాకపోవటంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. మరో వైపు బదిలీలు కోసం జిల్లా ప్రజాప్రతినిధుల లెటర్ల కోసమే గాకుండా మరింత రికమండేషన్ గట్టిగా ఉంటుందనే ఉద్దేశంతో ఏకంగా నారా లోకేష్ నుంచి కూడా రికమండేషన్ లెటర్లు కొందరు అధికారులు తీసుకున్నట్లు సమాచారం. ఈనెల 26న అనంతపురం జేడీఏ కార్యాలయంలో జోన్-4 పరిధిలోని జిల్లాల జేడీఏలు అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జేడీఏలు కౌన్సి లింగ్‌కు హాజరుకానున్నారు. సీనియర్ అసి స్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్లైన్లో ఇచ్చిన ఆప్షను పరిశీలించి, కమిషనరేట్‌కు పంపుతారు. ఏఈఓలు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర కిందిస్థాయి సిబ్బంది బదిలీలు జేడీఏ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తారు. ఆయా సిబ్బందికి కౌన్సెలింగ్ తేదీని ఇంకా ఖరారు చేయలేదు. ఇప్పటి దాకా ఆన్ లైన్ లో బదిలీల స్థానాలకు వెబ్ ఆప్షన్ ఇచ్చేందుకు సర్వర్ ఓపెన్ కాలేదు. దీంతో బదిలీ కోసం ప్రయత్నం చేసే అధికారులు, సిబ్బందిలో ఆందోళన నెలకొంది. ఒకవైపు సిఫార్సు లేఖలకోసం ప్రయత్నం చేస్తూనే మరో వైపు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకొనే అందుకు వెబ్ లింక్ ఓపెన్ కోసం ప్రయత్నం చేస్తున్నారు.

సంయుక్త వ్యవసాయ సంచాలకుల కార్యాలయం

వెబ్ లింక్ సమస్య లేదు : జిల్లా వ్యవసాయ అధికారి

బదిలీలకు ఆప్షన్లు ఇచ్చుకునే ఉద్యోగులకు వెబ్‌లింక్ సమస్య లేదని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. బదిలీల కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించేందుకు ఆన్ లైన్ వెబ్ లింక్‌ను ఉద్యోగులకు తెలియజేశామన్నారు. వారు వారి సిఎఫ్ఎంఎస్ ఐడి నమోదు చేస్తే ఓటిపి వస్తుందనిఓటిపి ఆధారంగా లాగిన్ అయ్యి వారికి కావాల్సిన స్థానాల్లో ఆప్షన్ ఇచ్చుకోవచ్చని అన్నారు. బదిలీ కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వాటిని మాన్యూవల్ గా కూడ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం సమర్పించాలన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లోపు పారదర్శకంగా నిర్వహిస్తామని ఆమె చెప్పారు.

రెగ్యులారిటీ పనులపై ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ టిఎస్. చేతన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెగ్యులారిటీ పనులపై ఆయా మండలాల ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించాలనికలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మండల స్థాయిలో జరిగే అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ సమత, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జునప్ప, వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, జెడ్‌పి డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం ప్రతినెల మూడవ శనివారం నిర్వహించడం జరుగుతోందన్నారు. జూన్ నెలలో నీరు - మీరు కార్యక్రమం ఉంటుందన్నారు. నీటి సంరక్షణ, వర్షపు నీరు సేకరణ, భూగర్భ జల వినియోగం, ఇంటింటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమాలను వందశాతం చేపట్టాలన్నారు. వీటిపై ఎంపీడీవోలు పర్యవేక్షించాలని నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎక్కడా తాగునీటి పైపులు లీకు కాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడ ఈ ఆటోలు, ట్రై సైకిళ్లు, ట్రాక్టర్లు, చెత్త సేకరణ పరికరాలు నిరుపయోగంగా ఉండడానికి వీలు లేదన్నారు. అలాంటి పరికరాలు, యంత్రాలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలన్నారు. చెత్త సేకరణలో కొన్ని మండలాలు వెనుకబడి ఉన్నాయని పనితీరు మెరుగుపరుచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు వంద శాతం జరగాలి : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు వంద శాతం జరగాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారుల సమావేశంలో పలు పథకాలపై కలెక్టర్ సమీక్షించారు. ఎన్టీఆర్ భరోసా పింఛను సక్రమంగా పంపిణీ చేయాలని, అన్న క్యాంటీన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, మున్సిపల్ కమిషనర్లు ఆహార నాణ్యతను క్యాంటీన్లలో పరిశీలించాలని ఆదేశించారు. పరిశుభ్రతపై డి ఎం హెచ్ వో లు, వైద్య సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్లలో మరుగుదొడ్లు పరిశీలించాలని బస్సుల సమయపాలన ఉండే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో జూన్ 1 వ తేదీ నుండి లిక్‌స్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులో ఉచిత శిక్షణిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ హరీష్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. పది తరగతి పాసై, ఇంటర్, డిగ్రీ (పాస్, ఫెయిల్) చదివిన 18 నుండి 30 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. శిక్షణతో పాటు సర్టిఫికేట్, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ కే శివప్రసాద్ ను 9676706976 సంప్రదించవచ్చున్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

26 నుంచి ట్యాలీ పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో ఈనెల 26వ తేదీ నుండి 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు ట్యాలీపై వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, పరిపాలన అధికారి గంగిరెడ్డి, రిసోర్స్ పర్సన్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్క్‌షాప్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, కెరీర్ అకౌంట్స్, ఫైనాన్స్, టాక్సేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ బేసిక్స్ తో పాటు ట్యాలీపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణాంతరం హాజరైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించేందుకు, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు వేయడం జరిగిందని ఎమ్మెల్యే సింధూర రెడ్డి తెలియజేశారు. మంగళవారం సందర్భంగా పుట్టపర్తి పట్టణంలోని గోపురం మెయిన్ రోడ్ లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్ ను ఎమ్మెల్యే తోపాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో ఉన్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణలో ఉదయం కొంతమంది, మధ్యాహ్నం కొంతమంది. శిక్షణ పొందవచ్చన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ పవన్, రవి నాయక్, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, పుట్టపర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ బెస్త చలపతి, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, రూరల్ కన్వీనర్ విజయ్ కుమార్,టిడిపి నాయకులు శ్రీరామ్ రెడ్డి, శ్రీరామ్ నాయక్, బొమ్మయ్య, మహేష్, శ్రీనివాసులు, ఉమాపతి, శ్రీరాములు, రాజప్ప, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, ఆప్కాస్ రద్దు చేయవద్దని సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. గంగాధర్ మాట్లాడుతూ ఒప్పంద, ఇంజినీరింగ్ కార్మికులు, పుడ్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్మిక కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు రమణ, రమేష్, రాందాస్, గణేష్, సద్దాం, నాగరాజు, పోతయ్య, నాగభూషణ, నాగార్జున, నరసింహులు, పెద్దన్న, రామయ్య, గోవింద, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ రద్దుకు ఉద్యమిద్దామని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, అనంతరం తహశీల్దార్ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామ్మోహన్, ముస్తాక్, ఫాజిల్, ఆంజనేయులు, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు మాబున్నీసా, సుజాత, శారద, హేమలత, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపాల్, జనార్ధన్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు అంజనమ్మ, గంగులమ్మ, సరస్వతి, రమణమ్మ, సివిల్ సప్లై యూనియన్ నాయకులు బాబాఫక్రుద్దీన్, మహబూబ్‌బాషా, రైతు సంఘం నాయకులు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నంబులపూలకుంట : ఉపాధి హామీ కూలీలకు సకాలంలో వేతనాలు, ఇన్సూరెన్స్, ఇతర అలవెన్సులు కల్పించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.కదిరప్ప డిమాండ్ చేశారు. మండలంలోని ఎన్.రెడ్డివారిపల్లి గ్రామ సమీపంలోని కొత్త కుంటలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో మంగళవారం ఆయన సమావేశమై కార్మిక చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా నాయకులు రమణ, సిపిఎం మండల కార్యదర్శి జి.రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మయ్య, మల్లిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, లాలూసాహెబ్, రేణుకేశ్వర్ రెడ్డి, అమ్మాజాన్, గోవిందమ్మ, రమణమ్మ, షకీలా, సరస్వతి, స్వాతి, లక్ష్మీదేవి, రామ్మోహన్‌రెడ్డి, వెంకటయ్య, రమణ, కూలీలు పాల్గొన్నారు.

పెనుకొండలో తహశీల్దార్ శ్రీధర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

> కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా కార్మికులు మున్సిపల్, ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు అమలు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కూలీలు, కార్మికులు, అంగన్వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

గోరంట్ల : కార్మికులు, ఉద్యోగులు, రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

కదిరి తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

వ్యక్తం చేశారు. వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం తహశీల్దార్ మారుతికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా కమిటీ సభ్యులు నర్సింహ, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణప్ప, మహబూబ్ బాషా, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు అంజలి, మీనాల ఆంజనేయులు, రామాంజనేయులు, అచ్చమ్మ, శోభ, గంగమ్మ, నంజుండప్ప, రాము, అంజనప్ప, ముజీబుల్లా, రామాంజనేయులు, మహమ్మద్, నాగరాజు పాల్గొన్నారు.

పెనుకొండ : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు ఇవ్వాలని, పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి హరి, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, నాగరాజు, బావమ్మ, మహబూబ్‌బాషా, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, కార్మికులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద

ధర్మవరంలో ర్యాలీ చేపట్టిన సిఐటియు నాయకులు

నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు గోవిందు, మల్లికార్జున, రామయ్య, సిఐటియు నాయకురాళ్లు సుజాత, రజిని, సుశీలమ్మ, ప్రమీలమ్మ, కుళ్లాయమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండలంలో ఇల్లు లేని పేదలందరికీ ఇంటి పట్టాలివ్వాలని సిపిఎం నాయకులు గంగిరెడ్డి, సిఐటియు నాయకులు నాగరాజు డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ దేవేందర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం గ్రామాల్లో 3 సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్‌రెడ్డి, నారాయణరెడ్డి, కలందర్, రమణ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : రైతులు, కార్మికుల సమస్యలపై పట్టణంలో ఏపి రైతు సంఘం, కౌలు రైతు కూలీలు, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి ఆర్‌డిఒ ఆఫీస్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతు సంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్.బాషా, ఆలకుంట మారుతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హైదర్‌వలి, ఎల్.ఆదినారాయణ, ఖాదర్‌వలి, వెంకటస్వామి, నారాయణస్వామి, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు మేకల బాబు, ముకుంద, అంగన్వాడీల సంఘం నాయకురాలు చంద్రకళ, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : కార్మికులు, ఉద్యోగులు, రైతుల సమస్యలపై ముదిగుబ్బలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం,కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

పరిగి : కేంద్ర ప్రభుత్వం కార్మికుల పొట్ట కొట్టేలా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లపై సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని, స్కీమ్ వర్కర్స్‌కు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలన్నారు. కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని, పరిశ్రమల మూసివేతలను ఆపి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి : మంత్రి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం చేనేత, జౌళి కార్మికుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముందుకు సాగుతున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గం అభివృద్ధికి తీసుకుంటున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయని చెప్పవచ్చు. ధర్మవరంలో ముడిపదార్థాల డిపో ఏర్పాటు కోసం ఇన్‌స్ట్రక్చర్ అండ్ టెక్నాలజీ సపోర్ట్ స్కీమ్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్ సెక్టార్‌కు ఆమోదం తెలపాలని మంత్రి సత్యకుమార్ ఇటీవల కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు లేఖ రాశారు. స్పందించిన కేంద్ర మంత్రి ఈ నెల 13వ తేదీ ఆ లేఖను సంబంధిత విభాగానికి పంపి అవసరమైన చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. తద్వారా ధర్మవరం చేనేత, జౌళి రంగానికి విశేషంగా మేలు జరగనుంది. ఈ ప్రాజెక్ట్ అమలైతే వేలాది మంది కార్మికులకు నాణ్యమైన ముడి పదార్థాలు తక్కువ ధరకు, సమయానికి అందుబాటులోకి వచ్చి వారి జీవనోపాధి పెరిగే అవకాశం ఉంది. దీనిపై మంత్రి స్పందిస్తూ ఇది వోకల్ ఫర్ లోకల్ దిశగా ఒక గొప్ప అడుగు అన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గణేష్ సర్కిల్‌లో ఉన్న పలు హోటళ్లలో మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారికి జరిమానా విధించారు. శివయ్య మాట్లాడుతూ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కిరాణా దుకాణాలు, వారపు సంతలో సోదాలు నిర్వహించి ప్లాస్టిక్ వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన

హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

హోటళ్లు, దుకాణాల యజమానులకు జరిమానా విధించామన్నారు. ఇకపై సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం పాటు జరిమానా రూ. 5వేల వరకూ విధిస్తామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

24 వరకూ వర్షాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జిల్లాలో భారీ ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసే సూచనలు ఉన్నాయని, కావున ప్రజలు ఈ నెల 24వ తేదీ వరకూ అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ మహేష్ మంగళవారం ఓ ప్రకటన లో తెలిపారు. పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంతో పాటు ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ఆర్‌డిఒ మహేష్

అత్యవసర పరిస్థితుల్లో ఆర్‌డిఒ కార్యాలయ కంట్రోల్ రూము-9866057959 సంప్రదించాలన్నారు. అలాగే ధర్మవరం తహశీల్దార్ కార్యాలయం- 9553929724, బత్తలపల్లి-7416597120, తాడిమర్రి-9391164803, ముదిగుబ్బ-6301279595, చెన్నేకొత్తపల్లి-7981734346, కనగానపల్లి- 8555828121, రామగిరి- 8500338330 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

టిడిపిలో యువతకు పెద్దపీట

మినీ మహానాడులో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

టిడిపిలో యువతకు పెద్దపీట వేస్తామని, ప్రతి కార్యకర్త నాయకుడు, ప్రజాప్రతినిధిగా ఎదగాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే కందికుంట ఆధ్వర్యంలో టిడిపి మినీ మహానాడు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా నియోజకవర్గ పరిశీలకులు వహీద్‌హుస్సేన్, జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పివి.పవన్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ, యువతకు జీవనోపాధి కల్పిస్తూ, పార్టీ ప్రతిష్టను పెంచుతున్నామని తెలిపారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకూ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కొందరు నాయకులు మతాలు, కులాల పేరుతో చిచ్చుపెట్టి రాజకీయాలు చేస్తుంటా రని అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో అన్ని సౌకర్యాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని,


ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

మున్సిపాలిటీలో భూగర్భ డ్రైనేజీని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యకర్తలు, నాయకుల సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గాండ్లపెంట ఎంపీపీ గజ్జల సోమశేఖర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కదిరి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మున్సిపల్ ఛైర్మన్ దిల్షాద్ ఉన్నీసా, వైస్ ఛైర్మన్లు షేగూ సుధారాణి, రాజశేఖర్ ఆచారి, మహిళా నాయకురాలు పర్వీన్ బాను, కౌన్సిలర్లు, మండల కన్వీనర్లు, నాయకులు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పుట్టపర్తిని గ్రీన్‌ఎనర్జీగా మార్చడమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తిని గ్రీన్‌ఎనర్జీగా మార్చడమే ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా ప్రతి ఏంటి పైకప్పుపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుంటే విద్యుత్ బిల్లు బాగా తగ్గించుకోవచ్చని సూచించారు. పట్టణంలోని సాయి ఆరామంలో మంగళవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పిఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ టిఎస్.చేతన్, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోలార్ ఎనర్జీ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి గృహ అవసరాల కోసం వాడుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అమ్ముకోవచ్చు అన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయన్నారు. ప్రస్తుతం రూ. 1000 వరకూ వచ్చే విద్యుత్ బిల్లు సోలార్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ఏర్పాటు చేసుకుంటే రూ. 350 లోపే వస్తుందన్నారు. అంతేగాక మిగులు విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. సోలార్ విద్యుత్ వల్ల రాష్ట్రానికి, దేశానికి విద్యుత్ ఆదా చేసిన వారవుతారన్నారు. అంతకుముందు సోలార్ ప్లాంట్ నమూనాను ఎమ్మెల్యే ప్రారంభించారు. సదస్సులో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కూటమి నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నల్లచెరువు కూడలిలో చేరిన వర్షంనీరు

నల్లచెరువులో 40 మి.మీ. వర్షం

నల్లచెరువు : నల్లచెరువులో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో దాదాపు 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలుస్తోంది. ప్రధాన కూడలిలో పెద్దఎత్తున నీరు చేరడంతో చెరువును తలపించింది. ఈ వర్షంతో వాతావరణం చల్లబడింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బత్తలపల్లి : బత్తలపల్లి, లింగారెడ్డిపల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా బుధవారం వాటి పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శివయ్య తెలిపారు. బత్తలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని మాల్యవంతం, ఎం.చెర్లోపల్లి, చీమలనాగేపల్లి, రాఘవంపల్లి, ముష్టూరు, పోట్లమర్రి, వేల్పుమడుగు, బత్తలపల్లి గ్రామాల్లో, లింగారెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి, సంజీవపురం, యర్రాయపల్లి గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ తెలిపారు.

టిడిపి మండల అధ్యక్షునిగా ప్రసాద్

పెనుకొండ: మండలం టిడిపి నూతన అధ్యక్షునిగా ఆడదాకులపల్లికి చెందిన యువ నేత, మాజీ సర్పంచి ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ మంత్రి సవిత ఆధ్వర్యంలో మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీలో అందరినీ కలుపుకొని ఐక్యమత్యంతో పని చేస్తామన్నారు. నూతన అధ్యక్షునికి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పూల మాలలు వేసి అభినందనలు తెలిపారు. ఇంతకుముందు సిద్దయ్య మండల టిడిపి అధ్యక్షునిగా సుదీర్ఘ కాలం పార్టీకి సేవలు అందించారు.

టిడిపి నూతన అధ్యక్షుడు ప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

స్వచ్ఛభారత్ కార్మికుల వేతనాల కోసం ధర్నా

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు బుట్టల్లో చెత్త వేసుకుని స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సాంబశివ మాట్లాడుతూ కార్మికులకు 20 నెలలకు పైగా వేతనాలు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు ఇచ్చేంత వరకూ గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులు, చెత్త సేకరణ పనులు ఆపేస్తామని, అందుకు అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కార్మికుల

ఎంపిడిఒ కార్యాలయం ముందు బైఠాయించిన కార్మికులు

న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకూ వారికి సిఐటియు మద్దతుగా ఉంటుందని తెలిపారు. ధర్నాలో స్వచ్ఛభారత్ యూనియన్ నాయకుడు అక్కులప్ప, లక్ష్మీదేవి, అనిల్, అంజి, గోవిందప్ప, గంగులప్ప, ఆశా వర్కర్ యూనియన్ నాయకులు శకుంతల, జ్యోతి పాల్గొన్నారు.

ఆర్‌డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌కు సన్మానం

తలుపుల : మండలంలోని మొటుకు పల్లి కార్యాలయంలో మంగళవారం మదర్ థెరిస్సా ఫ్రెండ్స్ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్‌డిటి ప్రోగ్రామం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. తలుపుల పిహెచ్‌సిలో ప్రతి నెలా గర్భిణులకు ఉచితంగా భోజనం ఏర్పాటు చేస్తున్న ట్లు తెలిపారు. మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ



మాంచో ఫెర్రర్‌ను సన్మానిస్తున్న మదర్ థెరెస్సా ఫ్రెండ్స్ సభ్యులు

యువత ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మన్సూర్, ఎద్దుల రాముడు, ఈశ్వరయ్య, పాత్రికేయులు రవి, షామీర్, వేంపల్లి బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

23న టిడిపి మినీ మహానాడు

ధర్మవరం రూరల్ : ఈ నెల 23వ తేదీ పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న శ్రీమారుతి రాఘవేంద్రస్వామి కళ్యాణ మండపంలో టిడిపి మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ టిడిపి నాయకులు పరిసే సుధాకర్, కమతం కాటమయ్య, చింతలపల్లి మహేష్, నాగూర్ హుస్సేన్ తెలిపారు. పట్టణంలో మంగళవారం వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో మినీ మహానాడు నిర్వహిస్తామని నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కేశగాళ్ల శీన, బాబూఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కోడిపల్లిలో కార్డెన్ సెర్చ్

లేపాక్షి : హిందూపురం డీఎస్పీ కెవి.మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కోడిపల్లి గ్రామం లో పోలీస్ సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అందులో భాగంగా అక్రమంగా మద్యం విక్రయించే వారు, అనుమానాస్పద ఇళ్లల్లో సోదాలు చేశారు. అనంతరం రోడ్ భద్రత, బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా ఎలాంటి గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లొద్దని సూచించారు. కలిసి మెలిసి ప్రశాంతంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో సిఐ జనార్దన్, ఎస్‌ఐలు నరేంద్ర, మునీర్ పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి

గుడిబండ : మండలంలోని నాచేపల్లి గ్రామంలో మంగళవారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను సాదర సామాజిక వర్గం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామపెద్దలు, వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ భగీరథ మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమన్నారు. గంగను భువికి తెచ్చిన ఆ మహనీయుడిని స్మరించడం, పూజించడం మనందరి కర్తవ్యమన్నారు. ఏదైనా సాధించాలనే పట్టుదలకు భగీరథ ప్రయత్నం ఓ స్ఫూర్తిదాయకమని తెలిపారు.

నేలకోటలో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలతో మంగళవారం మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీశ్‌బాబు మండలంలోని నేలకోట గ్రామంలో తాగునీటి బోరు వేయించారు. ఇటీవల గ్రామస్తులు తాగునీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ఆ గ్రామంలో వెంటనే బోరు వేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో హరీశ్‌బాబు గ్రామంలో పర్యటించి బోరు వేయించారు. అనంతరం ఆయన ప్రధానమంత్రి కిసాన్ విద్యుత్ యోజన ద్వారా గ్రామాల్లో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా కల్పించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. విద్యుత్ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పునర్నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు గృహ వినియోగానికి నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు. ఆయన వెంట నాయకులు రాము, బిల్లే శ్రీనివాసులు, పవన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా తిరంగా ర్యాలీ

తాడిమర్రి : ఉగ్రవాదంపై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో భారత త్రివిధ దళాల సైనికులకు మద్దతుగా మంగళవారం తాడిమర్రిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ, పోలీస్, వైద్య సిబ్బంది జాతీయ జెండాలు చేతబూని భారత్ మాతాకీ జై అంటూ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే వీరమరణం పొందిన సైనికుల సేవలను స్మరించుకున్నారు. ర్యాలీలో నాయకులు వన్నూరురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు, ఉద్యోగులు

టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

తలుపుల : తలుపుల మేజర్ పంచాయతీలోని బీసీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త బత్తల రామాంజనే యులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలియడంతో టిడిపి మండల నాయకులు మేడా శంకర్ మంగళవారం అతడికి రూ. 5వేలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బిసి సెల్ నాయకుడు గంగరాజు, గణేష్, పక్కీరప్ప, అశోక్, నరేష్, గంగార్జున, సాయి, తరుణ్ ఉన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

నల్లమాడ : మండలంలోని రెడ్డిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ శిక్షణ 90 రోజులు ఉంటుందని, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ పంపిణీ చేస్తామన్నారు. అనంతరం వారు గ్రామంలో జరిగే చిన్నమ్మ జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట టిడిపి మండల నాయకులు ఉన్నారు.

కుట్టు మిషన్ వితరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సినీనటుడు ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పుట్టపర్తి ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు షామీర్, సాయి శ్రీకాంత్ సహకారంతో స్థానిక హనుమాన్ సర్కిల్‌లో చెన్నేకొత్తపల్లి మండలంలోని వెంకటంపల్లి గ్రామానికి చెందిన మీనాక్షికి కుట్టు మిషన్ అందజేశారు. అలాగే పుట్టపర్తి గ్రామదేవత సత్తెమ్మ గుడిలో అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శ్రావణ్, లోకేష్, జావిద్, సురేష్, రాజు, శ్రీనివాసులు, సురేష్, అశోక్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమానుల రక్తదాన శిబిరం

ధర్మవరం రూరల్ : తారక్ చేయూత ఛారిటబుల్ ట్రస్టు, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు అంకె రామాంజనేయులు, ఉపాధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని రంగా థియేటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 44 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు రూ. లక్ష ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లు వారు తెలిపారు. శిబిరంలో తుకారాం, ముత్యాలు, రమేష్, నవ కుమార్, వేణుగోపాల్, గురునాథ్ పాల్గొన్నారు.


మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న ఎన్టీఆర్ ఫ్యాన్స్

మిస్సింగ్ కేసు నమోదు

బత్తలపల్లి : కొడుకు కనిపించలేదని ఓ తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని పోట్లమర్రి గ్రామానికి చెందిన చింతపంటి చెన్నారెడ్డి కుమారుడు పురుషోత్తంరెడ్డి ఆన్‌లైన్‌లో జూదం ఆడుతూ చాలా నష్టపోయాడు. ఈ క్రమంలో తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక కొద్దిరోజులుగా ఆవేదన చెందేవాడు. మంగళవారం పని మీద బత్తలపల్లికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

పుట్టపర్తి రూరల్ : జిల్లా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన మద్యాన్ని మంగళవారం అధికారులు ధ్వంసం చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన కర్నాటక, ఆంధ్ర మద్యం, నాటుసారా, కల్లును బ్రాహ్మణపల్లి డంపింగ్ యార్డ్ సమీపంలో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సిఐ నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ సురేష్, పాల్గొన్నారు.

కేబుల్ చోరీ నిందితుల అరెస్ట్

పావగడ : సోలార్ ప్లాంట్ల నుంచి డిసి కేబుల్ వైర్లను దొంగిలిస్తున్న నిందితులను మంగళవారం తిరుమణి పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని ఆఫ్‌బండకు చెందిన మల్లేష్, బాబు, మంజలను అరెస్ట్ చేయగా మరో నిందితుడు నాగరాజు పరారీలో ఉన్నాడని తెలిపారు.సిఐ గిరీష్, ఎస్‌ఐలు లక్ష్మణ్, మల్లప్ప, ఎఎస్ఐ గోవిందరాజులు, సోమశేఖర్, శ్రీకాంత్‌నాయక్ శ్రమించి నిందితులను అరెస్టు చేశారు. అలాగే రూ. 2 లక్షల విలువైన డిసి కేబుల్ వైరు, రెండు టివిఎస్ ఎక్స్‌ఎల్ మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

మహారాజశ్రీ పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
M.V.O.P. No: 4/2018
S.K. లోకేష్ నాయక్ @ లోకేష్ నాయక్.
...రెస్పాండెంట్స్
Vs
P. నాగేంద్రనాయక్ @నాగేంద్ర నాయక్ మరియు వగైరాలు.
...రెస్పాండెంట్ నెం.1
1వ రెస్పాండెంట్‌నకు నోటీసు
1.P. నాగేంద్ర నాయక్ ఏ నాగేంద్ర నాయక్, S/o P. ఆంజినేయులు, నివాసం: D.No: 11-86, అద్దనంపల్లి, తవళం మజరా, తనకల్లు మండలం, శ్రీ సత్య సాయి జిల్లా.
పై పిటిషనర్ దాఖలు చేసిన పై పిటిషన్ నందు మీ హాజరు నిమిత్తమై పై కనిన పిటిషన్‌ను తేది: 25.06.2025వ తేదీన వాయిదా వేసిఉన్నారు, కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో 25.06.2025 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియచేయడమైనది.
//By Order of Court//
పి. షౌకత్ అలి, M.A., B.L.,
న్యాయవాది, పీలేరు.
Cell No : 9441451350